RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
జనవరి : 23 గురువారం సంపుటి : 29 సంచిక : 20


2లో

## ఒంగోలు లో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ర్యాలీ

- పాల్గొన్న మంత్రి,ఎంపి, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ

## సంక్షేమ వసతి గృహాల నిర్వహణ కోసం

# రు.143 కోట్లు

### - జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి డోలా



అగ్ని న్యూస్, ఒంగోలు (జనవరి 22 )


రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాల నిర్వహణ కోసం ప్రభుత్వం 143 కోట్ల రూపాయలు కేటాయించింది అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. పేద పిల్లలు చదువుకుంటున్న సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో , ఉత్తమ పరీక్ష ఫలితాలు రాబట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని స్వామి స్పష్టం చేశారు. బుధవారం ఆయన ప్రకాశం భవనంలో సాంఘిక సంక్షేమ, వైద్య ఆరోగ్య, తాగునీటి సరఫరా శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు, ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా లతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్ళ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 143 కోట్ల రూపాయలను హాస్టళ్ళ మరమ్మతుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా హాస్టళ్ళ నిర్మాణం అవసరం పైనా ఆయన ఆరా తీశారు. సంక్షేమ హాస్టళ్ళ లోని సిబ్బంది, ట్యూటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ హాస్టల్లో పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా మరింత దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన ఫలితాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హాస్టల్ లోని విద్యార్థులకు రెగ్యులర్గా ఆరోగ్య పరీక్షలు చేయాలని పునరుద్ఘాటించారు. ఖాళీలు ఉన్న చోట విద్యార్థుల సామాజిక తరగతి తో సంబంధం లేకుండా అడ్మిషన్లు మంజూరు చేయాలని మంత్రి చెప్పారు. దివ్యాంగులైన విద్యార్థులు పెన్షన్ల కోసం ప్రతి నెల వారి స్వగ్రామాలకు వెళ్లకుండా ఆన్లైన్లో నే పెన్షన్ డబ్బులను వారి ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలోని ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, మాతా శిశు మరణాలు తగ్గించాలని, ఆసుపత్రులలోప్రసవాలు పెంచాలని, ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని మంత్రి ఆదేశించారు. గుండెపోటు సంభవించినప్పుడు తక్షణమే ప్రమాదాన్ని నివారించడానికి

2లో

## సమయపాలన పాటించని

# వైద్య సిబ్బంది



అగ్ని న్యూస్,గిద్దలూరు (జనవరి 22):

పట్టణం లోని జగనన్న కాలనీలో గల అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యుపిహెచ్సి) సిబ్బంది సమయపాలన పాటించకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిబంధనల ప్రకారం పని చేయాలి. అయితే వైద్యాధికారి తో సహా సిబ్బంది కూడా ఆ విధంగా విధులు

8లో

## హై వోల్టేజ్ తో ప్రభుత్వ పాఠశాల లో చెలరేగిన మంటలు




అగ్ని న్యూస్,పెద్దారవీడు (జనవరి 22):

మండలం లోని సానికవరం గ్రామం లో విద్యుత్ హై వోల్టేజ్ తో ఓ ఇంట్లో, ప్రభుత్వ పాఠశాల లో చెలరేగిన మంటలు చెలరేగాయి. ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అగ్నిమాపక సిబ్బంది ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. దగ్ధమైన వాటి విలువ లక్ష రూపాయలు ఉంటుందని ఇంటి యజమాని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలోని 50 వేల రూపాయలు విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, సిస్టం దగ్ధమైనట్టు ఉపాధ్యాయుడు తెలిపారు.

## నేడు మంత్రి లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం



అగ్ని న్యూస్,మార్కాపురం (జనవరి 22) :

టీడీపీ యువనేత, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు జన్మదినం సందర్భంగ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం జనరల్ హాస్పిటల్ వారి సహకారంతో మార్కాపురం పట్టణంలోని బొగ్గవరపు వారి కల్యాణ మండపం లో కందుల ఓబుల్ రెడ్డి హాస్పిటల్ ఎదుట మెగా రక్తదాన శిబిరం నేటి ఉదయం 8:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు.

8లో


RK అగ్ని న్యూస్ The Power Of Truth
23 గురువారం , జనవరి 2025

## ఒంగోలు లో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ర్యాలీ

మొదటి పేజీ తరువాయి

అగ్ని న్యూస్,ఒంగోలు (జనవరి 22): ఒంగోలు పట్టణంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు.లఈ ర్యాలీలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి , ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్,జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా,జిల్లా ఎస్పీ దామోదర్, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా చూసుకోవచ్చని అన్నారు. వాహన చోదకులు, రహదారి నియమాలు పాటించాలి అని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోరారు.

## బహిరంగ మూత్ర విసర్జన కు మూల్యం తప్పదు..!




అగ్ని న్యూస్,గిద్దలూరు (జనవరి 22):ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో మూత్రం విసర్జిస్తే రూ. 20 లు జరిమాన విధిస్తున్నారు గిద్దలూరు ఆర్టీసీ సిబ్బంది. అంతా బాగానే ఉంది కానీ బస్టాండ్ ఆవరణలో మూత్రం పోయకూడదని ఎక్కడైన బోర్డులు పెట్టారా. అవగాహన కల్పించారా అంటూ ప్రయాణికులు విమర్శిస్తున్నారు. బస్టాండ్ లో మరుగుదొడ్లు ఉన్నా.. అక్కడ మూత్రానికి డబ్బులు వసూలు చేస్తున్నారని, ప్రయాణికులు వాపోతున్నారు. తమ సమస్యల గురించి ఆర్టీసీ అధికారులు ఆలోచించాలని ప్రయాణికులు కోరుతున్నారు.




## అక్రమ పెన్షన్ల ఏరివేత షురూ

అగ్ని న్యూస్,పొదిలి (జనవరి 22): అక్రమ పెన్షన్ల ఏరివేత ప్రారంభమైంది. దీనిపై ప్రత్యేక వైద్య బృందం మండలంలో పర్యటించి పెన్షన్లు తీసుకుంటున్న డయాలసిస్, పెరాలసిస్ వ్యాధి గ్రస్తులకు నిజ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.నగర పంచాయితీ పరిధిలో 6,మండల పరిధిలో 7 మందికి వైద్య బృందం వైద్యపరీక్షలు నిర్వహించారు. దివ్యాంగులకు నూతన సదరం సర్టిఫికెట్ తప్పనిసరి అని, నూతన సర్టిఫికెట్ తోనే పెన్షన్ కొనసాగింపు ఉంటుందని వారు తెలిపారు. ఫిబ్రవరికల్లా అక్రమ పెన్షన్ల ఏరివేత పూర్తవనుందని సమాచారం.

## సంక్షేమ వసతి గృహాల నిర్వహణ కోసం రు.143 కోట్లు

మొదటి పేజీ తరువాయి

ఇంజక్షన్ వేసే స్టెమీ ప్రాసెస్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సరఫరా అవుతున్న తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఆగస్టు వరకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సాగర్ జలాలను మరో విడత విడుదల చేయనున్నారని,వాటితో చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని మంత్రి చెప్పారు.

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో 800 ఉన్న ఓపీ లు ప్రస్తుతం 200లకు తగ్గిపోయాయని అన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగుల పై శ్రద్ధ పెట్టకుండా వైద్యులు ప్రైవేట్ గా ప్రాక్టీస్ చేస్తున్నారని చెప్పారు. శానిటరీ వర్కర్ ను ఏజెంట్లుగా పెట్టుకుని దివ్యాంగుల పెన్షన్ కోసం నకిలీ సర్టిఫికెట్లను వైద్యులు మంజూరు చేశారని ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటి వరకు సదరు శానిటరీ వర్కర్ పైన చర్యలు తీసుకోలేదని ఆయన అన్నారు. దీనిపై సూపరింటెండెంట్ ను మంత్రి వివరణ కోరగా.... డీ.ఎం. ఈ. తో మీటింగ్ ఉండడంతో సూపరింటెండెంట్ రాలేదని, అందుకే తాను వచ్చానని డిప్యూటీ సూపరింటెండెంట్ చెప్పడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి, కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తుంటే డి.ఎం.ఈ. రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు సమీక్ష సమావేశాలకు ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధి లోని తాగు నీటి బోర్వెల్స్ ను రిపేరు చేయించాలని ఎమ్మెల్యే కోరారు. పొదిలి ప్రాంతానికి వారానికి 30 గంటల పాటు చేస్తున్న తాగునీటి సరఫరాను కనీసం 48 గంటలకు పెంచాలని కోరారు.

కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పామూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి కనిగిరి కి డిప్యూటేషన్ పైన వేసిన గైనకాలజిస్ట్ అక్కడ విధులు నిర్వహించడం లేదని, పామూరు కు కూడా తిరిగి రాలేదని, చెప్పకుండా విధులకు గైర్హాజరైన ఆమెపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రి పై వచ్చే నెల మొదటి వారంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. దాతల సహాయంతో ఆసుపత్రిని మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మోటార్లు పనిచేయక పోవడం వలన మద్దిపాడు,ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లోని సుమారు 50 గ్రామాలకు మంచినీటి సరఫరాలో 17 రోజుల పాటు సమస్య తలెత్తిందని అన్నారు. ఇలాంటి సమయంలో ఉపయోగపడేలా స్పేర్ భాగాలను ముందుగానే ఎందుకు అందుబాటులో పెట్టుకోలేదని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒంగోలు నగర పరిధిలో వినియోగించకుండా ఉన్న ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కు చెందిన 146 ఎకరాలను రెవిన్యూ శాఖకు బదలాయిస్తే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వవచ్చని ఆయన అన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.

గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో రేడియాలజిస్టు, పీడియాట్రీషియన్, అనస్థీషియా వైద్యులను నియమించాలని కోరారు. ఆ ఆసుపత్రిలో ఉన్న నియో నాటల్ కేర్ యూనిట్ ను స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ గా అప్గ్రేడ్ చేయాలని, కంభం ఆసుపత్రిలో డాక్టర్ పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని పలు గ్రామాలలో 500 అడుగుల కంటే లోతులో ఉన్న బోర్ వెల్స్ మాత్రమే పనిచేస్తున్నాయని, వేసవిని దృష్టిలో పెట్టుకుని అన్ని బోర్ వెల్స్ కు మరమ్మతులు చేయాలని, భూగర్భ నీటి మట్టాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ వివిధ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను తన ఎంపీ ల్యాడ్స్ నుంచి కేటాయిస్తానని, ఇందుకు అవసరమైనప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు చెప్పారు.

దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ గతంలో దర్శి లోని ప్రభుత్వ ఆసుపత్రికి మదర్ బ్లడ్ బ్యాంక్ గా చీరాల ఉండేదని, కొత్త జిల్లా ఏర్పడిన దృష్ట్యా మదర్ బ్లడ్ బ్యాంకును కూడా ప్రస్తుత జిల్లాలోనే అనుసంధానం చేస్తే బాగుంటుందని అన్నారు. దర్శి ఆసుపత్రిలో తాత్కాలిక మార్చురీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్.ఏ.పి. ప్రాజెక్టు లోని ఫిల్టర్ బెడ్లు దెబ్బతిన్నందున వాటిపై దృష్టి పెట్టి సరి చేయించాలని కలెక్టర్ ను కోరారు.

ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ వేసవిలో తమ ప్రాంతంలో మంచినీటికి తీవ్ర ఎద్దడి ఉంటుందన్నారు. ఈ దృష్ట్యా ఇప్పటినుంచే అలాంటి గ్రామాలను గుర్తించి తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయించడం పై దృష్టి పెట్టాలని కలెక్టర్ ను కోరారు. దోర్నాల లోని గిరిజనుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి అవసరమైన విధులను కేటాయించి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని మంత్రిని కోరారు. ఎర్రగొండపాలెం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాత్ ల్యాబ్ ఏర్పాటు చేయటానికి దాతలు సుముఖంగా ఉన్నారని, ఇందుకు అవసరమైన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, ఎస్.సి. కార్పోరేషన్ ఈ.డి. అర్జున్ నాయక్, ఏ.పి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఈ.ఐ.ఎస్. కో-ఆర్డినేటర్ జయ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏ.డి. అర్చన, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు, డి సి హెచ్ ఎస్ సరిబాబు, ఇరిగేషన్ ఎస్.ఈ. వరలక్ష్మి, ప్రాజెక్ట్స్ ఎస్.ఈ. బాల మురళీ మోహన్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ. (ఇంచార్జ్) బాల శంకర రావు, రిమ్స్ సూపరింటెండెంట్ జమున, ఇతర ఆధికారులు పాల్గొన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

# గోగులదిన్నె, వేములకోట లో పొలం పిలుస్తుంది కార్యక్రమం






అగ్ని న్యూస్,మార్కాపురం (జనవరి 22): మండలంలోని గోగులదిన్నె, వేములకోట గ్రామాలలో ఉద్యానవన అధికారి రమేష్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మిరప పంటను పరిశీలించారు. కొమ్మ ఎండు, కాయ కుళ్ళు తెగులును గమనించి దాని నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల లో భాగంగా టేబుకొనజిల్ 1మీ.లీ (లేదా) ఒక లీటర్ నీటికి, పైరాక్లో స్ట్రేబిన్ ఒమెటీరామ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటికీ (లేదా) దేఫేనకొనజోల్ 0.5మీ. లీ (లేదా) ఒక లీటర్ నీటికి, ఆజోక్సీ స్ట్రోబిన్ 1మీ.లీ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయడంవలన కాయ కుళ్ళు సమర్ధవంతంగా నివారించవచ్చని తెలిపారు. తదుపరి గోగులదిన్నె, వేములకోట గ్రామాల యందు గ్రామసభలు నిర్వహించి ప్రస్తుతం ఉద్యానవన శాఖ ద్వారా అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, రాయితీలు గురించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గోగులదిన్నె, వేములకోట రైతుసేవాకేంద్రం సిబ్బంది శివ కుమార్, మల్లికార్జున్,భాగ్యలక్ష్మీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల



అగ్ని న్యూస్,పొదిలి (జనవరి 22): నగర పంచాయతీ పరిధిలోని శ్రీ సాయి బాలాజీ నగర్ నందు నూతన ఎన్ఏపి సాగర్ వాటర్ ట్యాంకును మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పట్టణ, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :

# మోడీ ప్రభుత్వం నిరుద్యోగులను పెంచుతుంది




- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.కరుణానిది

అగ్ని న్యూస్,యర్రగొండపాలెం (జనవరి 22): కేంద్రంలో నరేంద్ర మోడీ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా దేశవ్యాప్తంగా నిరుద్యోగతను పెంచి పోషిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్. కరుణానిధి విమర్శించారు. అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ యర్రగొండపాలెం నియోజకవర్గ మహాసభ బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కరుణానిధి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో ఘోరంగా విఫలం కావడంతో పాటు నిరుద్యోగం రికార్డ్ స్థాయిలో పెంచుతున్నారని, సమగ్ర యువజన విధానం ద్వారా నిరుద్యోగ సమస్య నిర్మూలించవచ్చని అన్నారు. ధనవంతుల సంపద పున: పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వంతో రాయితీలు తీసుకొని కోట్లది రూపాయలు ప్రజల సొమ్మును దోచుకుంటున్న ధనవంతుల సంపదను ప్రజలకు పంపిణీ చేయాలని నినాదంతో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు.మోడీ విధానాల ద్వారానే కార్పొరేట్లు రోజురోజుకి కోట్లాది రూపాయలు ఆదాయం పొందుతున్నారని విమర్శించారు. ధనవంతులకు బ్యాంకు రుణాలు రుణమాఫీ చేస్తూ ప్రజలపై భారం మోపడం సిగ్గుచేటు అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేసి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయలతో అమరావతి అభివృద్ధి చేస్తున్నారని, రాజధాని అన్ని ప్రాంతాల ప్రజలకు సంబంధించింది కాబట్టి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాలు కూడా అందరికీ భాగస్వామ్యం ఉండాలని, గతంలో హైదరాబాద్ ఫ్రీ జోన్ కావడం ద్వారా రాష్ట్రవ్యాప్త నిరుద్యోగులకు లబ్ధి చేకూరిందని తెలిపారు. జనవరి 26న ఒంగోలులో జిల్లా మహాసభ జరుగుతుందని ఈ మహాసభలో సమగ్ర యువజన విధానం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల నూతన నోటిఫికేషన్లు, వివిధ అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. అనంతరం యర్రగొండపాలెం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కన్వీనర్ గా యద్దనపూడి కోటయ్య, కో కన్వీనర్లుగా కే వెంకటేశ్వర్లు, టి.శ్రీను,మెంబర్లుగా వై.యేసుబాబు, డి.ఆదిత్య లను ఎన్నుకోవడం జరిగింది. ఈ మహాసభలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు డి శ్రీనివాస్, కెవి కృష్ణ గౌడ్, టీసీఎచ్ చెన్నయ్య, బాణాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయిని పద్మావతి అందరికీ ఆదర్శం



- ఎంఈఓ ఆంజనేయులు

అగ్ని న్యూస్,యర్రగొండపాలెం (జనవరి 22): మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (యస్ టీ ) ఉపాధ్యాయురాలు పద్మావతి సేవలు ఆదర్శనీయమని ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు. యర్రగొండపాలెం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పిచ్చిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు పదోతరగతి పరీక్షల దృష్ట్యా వారికి అవసరమైన పరీక్ష అట్టలు, పెన్నులు 83 మందికి సుమారు 6 వేల రూపాయలు ఖర్చుచేసి ఇచ్చారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గతంలో ఉపాధ్యాయిని పద్మావతి విద్యార్థులకు స్టడీ అవర్ లో టిఫిన్ కూడా ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. తన కూతురుని (మోక్ష) కూడా ఇక్కడే ప్రభుత్వ పాఠశాలలో చదివించడం అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయులు ఎంత కష్టపడి తరగతులు నిర్వహించినా , తోడ్పాటు అందించినా చదవాల్సింది , మంచిగా పరీక్షలు రాయాల్సింది విద్యార్థులేనని, బాగా చదవాలని, మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.మరో ముఖ్య అతిథి ఎంఈఓ 2 మల్లూ నాయక్ మాట్లాడుతూ క్రమశిక్షణ, సమయ పాలన ఎంతో ముఖ్యమని విద్యార్థులు తప్పక ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని తెలిపారు. అధ్యక్షులు పిచ్చిరావు మాట్లాడుతూ ఉన్న సమయం ఉపయోగించుకోవాలని, విద్యార్థుల బాగుకోసం పద్మావతి ఈ సహాయం చేయటం ఎందరికో ఆదర్శమని ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల శ్రేయస్సు ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా పాటుపడుతున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఉపాధ్యాయురాలు పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు చక్కని మార్గంలో మంచి ఫలితాలు సాధించాలని , ఏదో తనకు, తన కూతురు విద్య కు తోచిన చిన్న పాటి సాయమేనని తన గొప్పమనసు చాటుకుని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు పద్మావతి మేడం కి ధన్యవాదాలు తెలిపారు.

# గిద్దలూరు సమస్యల పై గళం విప్పిన ఎమ్మెల్యే ముత్తుముల



అగ్ని న్యూస్,గిద్దలూరు (జనవరి 22): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అధ్యక్షతన జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్, ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్ల పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ, ఆర్ డబ్ల్యూఎస్ వైద్యశాఖలకు సంబందించిన సమస్యలను లేవనెత్తి వాటిని పరిష్కారం చేయాలన్నారు. నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 17 ఉన్నాయని, ఇందులో ఏ ఎస్డబ్ల్యూఓ పాయింట్స్ 2 మాత్రమే ఉన్నాయని, వసతి గృహాలకు పూర్తి స్థాయిలో స్వంత భవనాలు లేకపోవటంతో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, నూతన స్వంత భవనాల నిర్మాణానికి రెవిన్యూ శాఖ ద్వారా స్థల సేకరణ చేయించి, విద్యార్థులకు సరైన సౌకర్యాల కల్పన కు విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు.అదే విధంగా బెస్తవారపేట మండలంలో ఒక ఎస్ టీ ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని, బి సి సంక్షేమ వసతి గృహాలకు స్థలం కేటాయించాలని, రాచర్ల, అర్ధవీడు గురుకులాల్లో డిగ్రీ తరగతులను అందుబాటులోకి తేవాలని కోరారు. ఎస్సి,ఎస్టీ, బోసి వసతి గృహాల్లో ఉద్యోగుల కొరత ఉందని ఆ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. గిద్దలూరు నియోజకవర్గం వెనుకబడిన వర్షాధార ప్రాంతం కావటంతో రాబోయే వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నాయన్నారు. గతంలో జలజీవన్ మిషన్ తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికిని పనులు పూర్తి కాలేదని, రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని గిద్దలూరు నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి ఎస్డిఎఫ్ నిధులు మంజూరు చేయవలసిందిగా కోరారు.గిద్దలూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో అన్ని విభాగాల వైద్యులను అందుబాటులోకి తీసుకొని రావాలని, మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసి రోగులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని, వైద్యశాలలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, వైద్యశాలల్లో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టంను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, సంరక్షణ సేవలను అందించడానికి ఫంక్షనల్ ఐసీయూ సెటప్ ను ఏర్పాటు చేయాలని, కంభం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో రోగులకు అన్నీ విభాగాల వైద్యులను అందుబాటులోకి తేవాలని కోరారు.

## పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేసిన ఎస్ఐ కోటేశ్వరరావు



అగ్ని న్యూస్,రాచర్ల(జనవరి 22): మండలంలోని రాచర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి ఆధ్వర్యంలో రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు సహకారంతో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం కోటేశ్వరరావు చేతుల మీదుగా మండల విద్యాశాఖ అధికారులు కోటేశ్వరరావు,గిరిధర్ శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బియల్ రామనాయక్, చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో చదువుకొని పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించి పాఠశాలకు తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఒక లక్ష్యంతో చదివి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలి అన్నారు.ఈ స్టడీ మెటీరియల్స్ కు సహాయం చేసిన దాత రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు కు చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. రాచర్ల విద్యాశాఖ అధికారులు కోటేశ్వరరావు, గిరిధర్ శర్మ మాట్లాడుతూ... చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా పేదవారికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ చైర్మన్ గజ్జ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మల్లారెడ్డిపల్లి, బొడ్డువానిపల్లి లో పొలం పిలుస్తోంది

అగ్ని న్యూస్,కొమరోలు(జనవరి 22):మండలం లోని మల్లారెడ్డిపల్లి, బొడ్డువానిపల్లి గ్రామాలలో మండల వ్యవసాయాధికారి కె.రాజశ్రీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వము తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని గురించి రైతులకు వివరించి,దీని ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను (ఐడి నంబర్ ) కేటాయించటం జరుగుతుందని తెలిపారు. గ్రామ వ్యవసాయ, ఉద్యాన పట్టు పరిశ్రమ సహాయకులు ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్సైట్లో రైతుల వివరాలు నమోదు చేస్తారు. రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసిన తర్వాత రైతుకు ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో వెసలుబాటును కల్పించనున్నారు.భూమి గల రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీ, వ్యవసాయ ఆధారిత వృత్తులపై జీవించేవారు అర్హులని తెలిపారు. రైతు ఆధార్ సంఖ్య, పట్టాదారు పాసుబుక్, మొబైల్ నంబర్ తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.అర్హులైన రైతులను గుర్తించటం, ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల రాయితీలు, భూ ఆధారిత చెల్లింపులు అయినటువంటి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా,పంట నష్టపరిహారం, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీ ద్వారా వ్యవసాయ పనిముట్లు అందించుట మొదలైనవి ఫార్మర్ రిజిస్ట్రీ నెంబర్ ఉన్నవారికి అందించడం జరుగుతుందని తెలిపారు. కావున రైతులు గ్రామ స్థాయి లో రైతు సేవా కేంద్ర సిబ్బందిని కలిసి నమోదు చేసుకోవాలని సూచించారు.గ్రామ సభ అనంతరం శనగ, పంటల క్షేత్ర స్థాయిలో పరిశీలించి చీడ పీడలు మరియు వాటి నివారణ చర్యలు రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు హసీనా, సిద్దయ్య రైతులు పాల్గొన్నారు

**ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :**




# పుచ్చకాయల పల్లె లో పశు వైద్య శిబిరం

మండలం లోని పుచ్చకాయలపల్లి గ్రామం లో బుధవారం ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరంలో పెద్దారవీడు మండల పశు వైద్య అధికారి డాక్టర్ బాలు నాయక్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ పాల ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించ డానికి ప్రభుత్వం ఉచితంగా గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల ద్వారా పశు వైద్య చికిత్సలు, నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన వంటి సేవలు అందిస్తారని తెలిపారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ వజ్రాల రామలక్ష్మమ్మ, గ్రామ నాయకులు కందుల పోల్ రెడ్డి, పోటిరెడ్డి వీరా రెడ్డి, పంచాయితీ సెక్రటరీ రామ కోటమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ అల్లు శ్రీనివాస రెడ్డి, పశు వైద్య సహాయకులు యం.వీరాంజనేయులు నాయక్, ప్రసాద్, షేక్ ఇస్మాయిల్, కిరణ్, అమీర్ బాషా, అల్లా బక్షు, తులసి రామ్ నాయక్ ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కేసు నమోదు చేయలేదని రోడ్డు మీద ధర్నా.. స్తంభించిన ట్రాఫిక్



అగ్ని న్యూస్ ,గిద్దలూరు (జనవరి 22) : మండలం కెఎస్ పల్లి గ్రామంలో అక్టోబర్ 28న ఈతకు వెళ్లిన ఐదు మందిలో గడ్డం వినోద్ అనే యువకుడు మృతి చెందాడు మృతి చెందిన గడ్డం ఆనంద్ బంధువులు అనుమానాస్పద మృతి గా కేసు నమోదు చేయమని పోలీసులను కోరారు . కానీ ఈ రోజు వరకు కేసు గురించి ఏ వివరాలు తెలపడం లేదని బంధువులు కెఎస్ పల్లి సమీపంలో నంద్యాల - అమరావతిరోడ్డు పై ధర్నా చేశారు. రెండు రోజుల కిందట గిద్దలూరు పోలీస్ స్టేషన్ దగ్గర కూడా తమ నిరసనను తెలియజేశామని, అయినా ప్రయోజనం లేదు అని వారు పేర్కొన్నారు దీంతో బుధవారం అమరావతి టూ నంద్యాల రోడ్డులో వారు ధర్నాకు దిగి తమకు న్యాయం చేయాలని నిరసనకు దిగారు. దీంతో కిలో మీటర్ల మేర వాహనాలు ఆగి పోయాయి.



# ఆటో డ్రైవర్లకు పట్టణ పోలీసుల కౌన్సిలింగ్



అగ్ని న్యూస్, మార్కాపురం (జనవరి 22):

మార్కాపురం పట్టణంలో రాత్రి వేళల్లో తిరిగి ఆటో డ్రైవర్లకు పట్టణ ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్లు బుధవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సైదు బాబు మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్యాసింజర్ ని ఎక్కించు కోవడం, అధిక ధరలు వసూలు చేయడం ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. రాత్రిపూట పలు ప్రాంతాల్లో నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రాత్రి వేళల్లో తిరిగి ఆటో డ్రైవర్లు, విధిగా ఐడి కార్డు, పోలీసు అనుమతి పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు.





# వెలగని వీధి లైట్లు...!

## - ఇబ్బంది పడుతున్న జనం

అగ్ని న్యూస్,పొదిలి (జనవరి 22):

పట్టణం లోని రథం రోడ్ సాయిబాబ గుడి వీదిలో ఉన్న మహర్షి స్కూల్ వద్ద గత కొన్ని రోజులుగా వీదిలైట్లు వెలగడం లేదని స్ధానికులు తెలిపారు. చిన్నారులు,వృద్దులు ఆ వీధి లో రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదే వీదిలో మహర్షి పాఠశాల ఉండటంతో విద్యార్దులు పాఠశాల స్టడి ఆవర్ ముగిసిన తరువాత ఇండ్లకు చేరుకునేందుకు కుడా ఇబ్బందులకు గురవుతున్నారు. వీధిలైట్లు వెలగక పోవడంతో వీధి లో చెట్ల మధ్య నుంచి పాములు, ఇతర విష పురుగులు,ముఖ్యంగా కుక్కల బెడద తో తీవ్రంగా ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేటట్లు చర్యలు తీసుకొవాలని స్ధానికులు కొరుతున్నారు.



# మంచం పైన ఉన్న పెన్షన్ దారులను పరిశీలన..!!



## - తొలి రోజు దేవరాజు గట్టు లో ..!

అగ్ని న్యూస్, పెద్దారవీడు (జనవరి 22):

మండలం లో మంచానికి, వీల్చైర్కు మాత్రమే పరిమితమై నెలవారీ రూ.15 వేలు పింఛను పొందుతున్న లబ్ధిదారుల అర్హతను పరీక్షించేందుకు మంగళవారం నుంచి ఎంపీడీవో జాన్ సుందరం ఆధ్వర్యంలో వెరిఫికేషన ప్రారంభమైంది. ముగ్గురు వైద్యులు, ఒక డిజిటల్ అసిస్టెంటు, ఒక మెడికల్ ఆఫీసరుతో కూడిన బృందం మండలంలో ఈ ప్రక్రియ ప్రారంభించారు. ఆరోగ్య పింఛను పొందుతున్న లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహించారు.ప్రభుత్వం నుంచి వచ్చిన పెన్షనదారుల జాబితా ప్రకారం మండలంలో తొలిరోజు దేవరాజు గట్టు పంచాయతీ లోని లబ్ధిదారులను తనిఖీ చేశారు. కాళ్లు, చేతులు కదలిక, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి వివరాలు నమోదు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్లు ఆరోగ్యపింఛన్లు పొందుతున్న వారిని పరీక్షించే విషయంలో తగిన సూచనలు, సలహాలు అందించారు. ఎంపీడీవో జాన్ సుందరం మాట్లాడుతూ డాక్టర్లు అర్హులకు ఎలాంటి పరిస్థితుల్లో అన్యాయం జరగకుండా అనర్హులను గుర్తిస్తామన్నారు. దివ్యాంగుల పరిస్థితిని డాక్టర్లు మొబైల్యాప్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కరు పాల్గొన్నారు

# వినుకొండ-గుంటూరు మధ్య నాలుగు వరుసల హైవే..!




(అగ్ని ప్రతినిధి, అమరావతి)

అనంతపురం నుంచి గుంటూరు వరకు ఉన్న జాతీయరహదారి-544 డి లో రెండు కీలక ప్యాకేజీలను నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. బుగ్గ-గిద్దలూరు మధ్య 135 కి.మీ, వినుకొండ-గుంటూరు మధ్య 84.80 కి.మీ కలిపి మొత్తం 219, 80 కి.మీ (దాదాపు 220 కి.మీ.) విస్తరణ పనుల్లో రెండు ఎలైన్మెంట్లకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) ఎలైన్ మెంట్ అప్రూవల్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి నిర్మాణానికి మొత్తం రూ.5,417 కోట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్హెచ్ఎఐ) వెచ్చించనుంది. రెండు ప్యాకేజీల్లో 21 చోట్ల బైపాస్ లు నిర్మించేందుకు అనుమతించింది.



# సమయపాలన పాటించని వైద్య సిబ్బంది

**మొదటి పేజి తరువాయి**

నిర్వహించడం లేదు. మంగళవారం కాలనీకి సంబంధించిన ఓ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సల కొరకు అక్కడికి వెళ్లగా వైద్యశాలలో ఒక్కరు కూడా లేకపోవడం కనిపించింది. వైద్యశాలలో అన్ని రూంలు తెరిచి ఉన్నాయి కానీ, సిబ్బంది మాత్రం ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. ఇంతలో ఓ వ్యక్తి అక్కడికి రాగా వైద్య సిబ్బంది గురించి వాకబు చేస్తే నేను స్టాఫ్ నర్స్ అని చెప్పాడు. డాక్టర్, సిబ్బంది గురించి అడిగితే డాక్టర్ రెండు గంటలకు వెళ్ళాడు. మిగతా సిబ్బంది ఎవరూ లేరు అని చెప్పడం జరిగింది.ఇక్కడ పనిచేసే సిబ్బంది ప్రతిరోజు మధ్యాహ్నం వరకు ఉండి మధ్యాహ్నం నుండే వెళ్ళిపోతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొందరు రోజుల తరబడి రాకపోయినా వారికి ఆబ్సెంట్ గాని సి ఎల్ గాని వెయ్యకుండా రిజిస్టర్ లో ఖాళీగా పెట్టడం కూడా వీరి బాధ్యతారాహిత్య నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తుంది. ఈ విషయంపై డాక్టర్ భార్గవ్ రంగారెడ్డి ని వివరణ కోరగా ఆయన కోటగడ్డ వీధిలో మందులకు వచ్చానని మిగతా సిబ్బంది కొందరు వచ్చారు, కొందరు లీవ్ లో ఉన్నారని చెప్పడం గమనార్హం.లీవ్ లో ఉన్నవారికి సి ఎల్ కానీ అటెండెన్స్ వేయలేదని అడిగితే వారు వచ్చిన తర్వాత వారి ద్వారా లీవ్ లెటర్ తీసుకొని తరువాత సిఎల్ వేస్తామని చెప్పడం గమనార్హం.

# నేడు మంత్రి లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం

**మొదటి పేజి తరువాయి**

ఉదయం 10 గంటలకు అక్కడే కేక్ కటింగ్ కార్యక్రమం కూడా కలదన్నారు. నియోజకవర్గం లోని అన్ని గ్రామాల నుండి, అన్ని పట్టణాలలోని వార్డ్ ల నుండి తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ప్రతి ఒక్కరు విచ్చేసి మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.













Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)